సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,24 మే 2024


## పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్ అమ్మితే చట్టపరమైన చర్యలు

### -సీఐ సన్యాసినాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పెట్రోల్ బంకుల్లో వాహనాల మినహ బాటిల్స్, టీన్ను లలో పెట్రోల్ పోసినట్లు అయితే బంకు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసినాయుడు హెచ్చరించారు.రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు - 2024 అనంతరం జరిగినపరిణామాలు ఘర్షణలు, అల్లర్లు, హింసాయుత సంఘటనలను దృష్టిలో పెట్టుకొని, జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు, మండలంలో ఉన్న అన్ని పెట్రోల్/డీజిల్ బంకులలో విడిగా టిన్నులు/డ్రమ్ములు/బాటిల్స్ లలో పెట్రోల్ అమ్మట పూర్తిగా నిషేధించడ మైనదని సీఐ తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించినచో బంకుల లైసెన్స్ లు రద్దు రద్దు చేయడం జరుగుతుందన్నారు. అలానేగ్రామాలలో చిన్న చిన్న బడ్డికొట్టుల వద్ద బాటిల్స్ లో పెట్రోల్/డిజల్ అమ్మటం చట్టరీత్యా నేరమన్నారు.అటువంటి వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ సన్యాసినాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకయ్య, రఘునాథ రావులు ఉన్నారు.

# అందరి దృష్టి కౌంటింగ్ పైనే

- అసలు ఈ ఓట్లను ఎలా లెక్కిస్తారు..
- రౌండ్‌లను ఎలా నిర్ణయిస్తారు..?



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసింది ఎన్నికల సంఘం.చీమచిటుక్కుమన్నా సరే ఇట్టే పసిగట్టేలా మూడెంచల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు సహా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో హై సెక్యూరిటీ కొనసాగుతోంది.ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల లోపల, బయట సీసీ కెమెరాలు అమర్చి ప్రత్యేక నిఘా ఉంచారు. స్ట్రాంగ్ రూంలోకి వెళ్లేందుకు ఓకే ఎంట్రీ, ఎగ్జిట్ ఉండేలా ఏర్పాట్లు చేయడంతోపాటు స్ట్రాంగ్ రూంకు డబుల్ లాక్ సిస్టమ్ పెట్టారు. అంతేకాదు, కౌంటింగ్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికలపోలింగ్‌ముగిసినతర్వాత అధికారులు ఓట్ల లెక్కింపులో ప్రతీ అంశాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధన మేరకు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు షురూ అవుతుంది. కానీ దీనికోసం ముందు నుంచే కసరత్తు జరుగుతుంది. లెక్కింపునకు 4గంటలకు ముందు అధికారులు తమ పనుల్లో నిమగ్నమవుతారు. సిబ్బంది తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు ఉదయం 4 గంటలకు వెళ్లాలి.5 గంటలకు వారికి లెక్కింపు చేయాల్సిన టేబుల్స్ చూపిస్తారు. సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిబ్బందితో ప్రమాణం కూడాచేయిస్తారు.లెక్కింపులో గోప్యత పాటిస్తామని వారు చెబుతారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మ్మొదలవుతుంది. గం. 8.30ల వరకూ ఇది కంటిన్యూ అవుతుంది. పోస్టల్ ఓట్లు ఎక్కువ ఉండి సమయం పడితే ఆ లెక్కింపు కొనసాగిస్తూనే ఈవీఎంల ఓట్ల లెక్కింపు కూడా చేస్తారు. ఒక నిమిషానికి 3 పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కిస్తారని అంచనాగా ఉంది.

**రౌండ్లను ఎలా నిర్ణయిస్తారు..?**

నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను, వాటి పరిధిలో పోలైన ఓట్లు ప్రాతిపాదికన ఎన్ని రౌండ్‌లు కావాలో నిర్ణయం తీసుకుంటారు. ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాల సమయం వరకూ పడుతుంది. 14 - 15 టేబుళ్లపై లెక్కింపు చేస్తారు. ఒకసారి మొత్తం టేబుళ్లపై ఉన్న ఈవీఎంల లెక్కింపు పూర్తయితే ఒక రౌండ్ పూర్తయినట్టుగా నిర్ధారిస్తారు.

**వివి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు ఎలా?**

ఓటింగ్ పట్ల విశ్వాసాన్ని మెరుగుపరచడానికి 2013లో ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్ (వివిపాట్) సిస్టమ్‌ని ఈవీఎంలకు జోడించారు. వివిపాట్ సిస్టమ్ అభ్యర్థి పేరు, ఎన్నికల చిహ్నాన్ని కలిగి ఉన్న ప్రింటెడ్ పేపర్ స్లిప్‌ను రూపొందిస్తుంది.ఈవీఎంలలెక్కింపుపూర్తయిన అనంతరం వీవీప్యాట్‌ల స్లిప్పులు లెక్కిస్తారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల నెంబర్స్‌ను చీటీలపై రాసి లాటరీ తీస్తారు. ఏయే వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కించాలో లాటరీ ద్వారా నిర్ణయం తీసుకుంటారు.

ఈవీఎంల లెక్కింపులోవచ్చిన ఓట్లు వివిపాట్‌ల స్లిప్‌ల ఓట్లను చూస్తారు. ఏదైనా వ్యత్యాసం ఉంటే మళ్లీ స్లిప్పులను రెండోసారి లెక్కపెడతారు. ఇలా మూడుసార్లు చేస్తారు. అప్పటికీ తేడా వస్తే స్లిప్పులలోని లెక్కనే పరిగణనలోకి వెళ్తుంది. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే.. ఈవీఎంల లెక్కింపుతో అనధికారికంగా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో అర్థమవుతుంది. కానీ వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు పూర్తయ్యే దాకా అధికారికంగా ప్రకటించడం అనేది ఉండదు.

ఎన్నికల్లో ఒక రౌండ్ ఫలితాలు ఈసీ అధికారికంగా ప్రకటించాలంటే 30 నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది. రౌండ్ పూర్తి అయిన తర్వాత అన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలి. మైక్రో అబ్జార్వర్, కేంద్ర ఎన్నికల పరిశీలకుల సంతకాలు చేయాలి. ఆ తర్వాత ఏవైనా ఈవీఎంలలోని ఓట్లను ఎన్నికల పరిశీలకుడు ఫలితాల రికార్డులతో పరిశీలిస్తారు. ఈవీఎంలలో వచ్చిన ఓట్లు, వీవీ ప్యాట్లలో వచ్చిన ఓట్లు సరిపోవాలి. ఆ తర్వాత ఏజెంట్లు ఎవరికి అభ్యంతరం లేదని చెప్పిన తర్వాత ఆర్వో రౌండ్ ఫలితాలు అధికారికంగా ప్రకటిస్తారు.ఈ ప్రక్రియలో ఏదైనా అభ్యంతరం ఉంటే ఓట్ల లెక్కింపు చాలా ఆలస్యం అవుతుంది.

**ఓట్ల లెక్కింపు ఇలా..**ఒక్కో ఈవీఎంలో వెయ్యి నుంచి 1200 ఓటు ఉంటాయి. రౌండ్ కి 14టేబుల్స్ మీద.. అంటే 14,000 నుంచి 15,000 ఓట్లు తెలుస్తాయి. లక్ష ఓటర్లు ఉంటే 8 నుంచి 10 రౌండ్లలో ఫలితం వస్తుంది. రెండు లక్షలు ఉంటే 16లేదా 20 రౌండ్లలో ఫలితం వెలువడుతుంది. భీమిలి, గాజువాక లాంటి మూడు లక్షల ఓట్లు ఓటర్లు ఉన్న చోట 24 రౌండ్లు ఉండచ్చు.

**ఓట్ల లెక్కింపు బాధ్యత ఎవరిది?**

ఒక నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి బాధ్యత వహిస్తారు. ఇందులో ఓట్ల లెక్కింపు కూడా ఉంటుంది. రిటర్నింగ్ అధికారి ప్రభుత్వ అధికారి లేదా రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి ప్రతి నియోజకవర్గానికి భారత ఎన్నికల సంఘం చేత నామినేట్ చేయబడిన స్థానిక అధికారి అయి ఉంటారు.

**కౌంటింగ్ ఎక్కడ జరుగుతుంది?**

పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్లను లెక్కించే స్థలాన్ని రిటర్నింగ్ అధికారి నిర్ణయిస్తారు. కౌంటింగ్ తేదీ, సమయం కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నిర్ణయించడం జరుగుతుంది. ఆదర్శవంతంగా ఒక నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును ఒకే చోట చేయాలి. ప్రాధాన్యంగా ఆ నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయంలో చేయాలి. ఇది రిటర్నింగ్ అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుందిల. అయితే, ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో సరాసరి 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటాయి. ఈ పరిస్థితిలో రిటర్నింగ్ అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వివిధ అసెంబ్లీ సెగ్మెంట్‌లకుఒకేచోటకానీ,వేర్వేరుస్థానాల్లో కానీ లెక్కింపు జరుగుతుంది

## ఘనంగా వ్యాస పూజ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక గోదావరి జర్నలిస్ట్ కాలనీ లో వేంచేసి ఉన్న శ్రీరామ సహిత సత్యదేవ దాసాంజనేయ ఉమా సాంబశివ మందిర ప్రాంగణంలో గురువారం వ్యాస పూజ ఘనంగా నిర్వహించారు. మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. తొలుత వ్యాసపూజ సందర్భంగా గురువుల నామస్మరణ పఠ న ము నిర్వహించారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత సత్యదేవ స్వామివార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం సర్వ మూల గ్రంధానికి వ్యాస పూజను మరియు దాసాంజనేయ స్వామి వార్లకు వైశాఖమాసం సందర్భంగా మామిడి పండ్లతో అలంకారము నిర్వహించి హారతులు చేశారు.మద్వేష్ మాట్లాడుతూ వైశాఖ మాస సందర్భంగా ఉషఃకాలములో నిర్వహించే స్థానము ఈరోజుతో సమాప్తి అవుతుందని ఈరోజు బుద్ధ జయంతి, వ్యాసపూజ వంటి విశేషాలు గురువారం రావడం ఎంతో భక్తి భావాలను పెచ్చుతాయని, గురువారం రావడం మధ్వాచార్యులు మొదలు శ్రీ సత్య ప్రమోదతీర్థుల వరకు అలాగే రాఘవేంద్ర స్వామి శ్రీపాదరాజుల వంటి గురువుల నామస్మరణ కూడా ఎంతో ముఖ్యమన్నారు. గురు స్మరణ ద్వారా మనకి అన్ని శుభాలు జరుగుతాయని చెప్పారు. అనంతరం భక్తులకు శ్రీ సత్యనారాయణ స్వామి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో డాక్టర్ పరశురామ్, తుంగమణి, అమూల్య రుక్మిణి, మౌనిక, రఘోత్తమ, రామా మణి, దీక్షిత, లక్ష్మీకాంత్ తో పాటు సత్యనారాయణమూర్తి పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా... గొల్లప్రోలు రైల్వేస్టేషన్

- యధేచ్ఛగా గంజాయి, గుట్కా, నాటుసారా అమ్మకాలు
- మత్తులో జోగుతున్న యువతతో ఇబ్బందులెదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే యంత్రాంగం






**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు పట్టణ పరిధి రైల్వే స్టేషన్లో ఇటీవల కొంతమంది యువకులకు గొల్లప్రోలు రైల్వే స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ప్రయాణికులు, స్థానికులు పేర్కొంటున్నారు. గొల్లప్రోలు రైల్వే స్టేషన్ గంజాయి, ఖైనీ, గుట్కాలు, నాటు సారా అమ్మకాలకు కేంద్ర బిందువుగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల యువకులు కొంతమంది రేయిం బవళ్లు రైల్వే స్టేషన్లో మత్తుకు బానిసలుగా మారి వివిధ రకాల ఘోరాలకు, నేరాలకు పాల్పడుతున్నారని గొల్లప్రోలు స్టేషన్లో రైల్వే ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం కొంతమంది యువకులు గంజాయి మత్తులో తేలుతున్నట్లు సమాచారం రైల్వే అధికారులకు వినిపించడం లేదా అని రైల్వే అధికారులను ప్రయాణికులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా నేరం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను, పోలీసులను ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని 1500 గొర్రెలు మేకలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి తరుణ్ కుమార్ మీడియాకు తెలిపారు. వర్షాకాలంలో వచ్చేఈ వ్యాధి నివారణకు ప్రతి రైతు తమ పశువులకు ముందుగా చిటుకువ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలి అన్నారు. మండలంలో 3000 గొర్రెలు, మేకలు ఉండగా మరో 1500 డోసులు రావాల్సి ఉందన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పి గన్నవరం సెక్షన్ నరేంద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో గల నరేంద్రపురం గంటి పెదపూడి ఫీడర్ వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున ఆదిమూలం వారి పాలెం ,బెల్లంపూడి, యర్రం శెట్టి వారి పాలెం, గుత్తుల వారి పాలెం, ఊడిమూడి, ఊడిమూడిలంక , గంటి పెదపూడి, గంటి పెదపూడి లంక, మరియు పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లం లంక , సిర్రా వారి లంక గ్రామాల ప్రజలు సదరు విషయాన్ని గమనించి మా సిబ్బందికి సహకరించగలరని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం రవికుమార్ తెలిపారు.

## వైభవంగా శ్రీ ఇడికాలమ్మ తీర్థం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మాచవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఇటికాలమ్మ అమ్మవారి తీర్థం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులతోపాటు భక్తులు అమ్మవారిని దర్శించుకొని చలివిడి పానకం, ముడుపులు, మొక్కుబడులను తీర్చుకొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మైపాల నాగబాబు, బండారు కొండల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయాన్ని మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువా రం రాత్రి నిర్వహించిన నృత్యం, వీరనాట్యం, శక్తివేషాల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి తేజ్ భరత్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లి నియోజక వర్గ పరిధిలోని పార్లమెంటు, అసెంబ్లి నియోజక వర్గాలకు చెందిన ఈవిఎమ్ యూనిట్స్ భద్రపరచిన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్, పోస్టల్ బ్యాలెట్ లు, స్టాట్యూటరీ మెటీరియల్ భద్రపరిచే క్రమంలో ప్రక్క ప్రక్కనే ఏర్పాటు చేసినట్లు రాజమండ్రి రూరల్ అసెంబ్లి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ తేజ్ భరత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల పై రాజకీయ పార్టీల, అభ్యర్థుల రెవిన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ, మే 13 పోలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ వి ఎమ్ యూనిట్స్, స్టాట్యూటరీ మెటీరియల్ , పోస్టల్ బ్యాలెట్ పత్రాలు స్ట్రాంగ్ రూమ్ లకి భద్రపరచి అభ్యర్థుల, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ వెయ్యడం జరిగిందన్నారు. అదే విధంగా ఆ మూడు రూములకి కూడా డోర్, కిటికీ లను చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఆలోగా తప్పనిసరిగా హాజరు కావాలని పరిశీలకులు వారి సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణా చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ అభ్యర్ధులు, ఏజెంట్స్ నిరంతరం పరిశీలించడం జరుగుతుందనీ అన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్స్ నేరుగా స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆమేరకు పోలీసు, గేజిటెడ్ అధికారి ఎస్కార్ట్ తో పంపనున్నట్లు తెలియ చేశారు. మూడు షిఫ్ట్ లలో తహాసీల్దార్లు ను నియమించినట్లు తెలిపారు. నియోజక వర్గంలో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

- ఎడిసి నాగ నరసింహారావు
- పారిశుద్ధ్య పనులు తనిఖీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్ తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అలాగే పలు ప్రాంతాల్లో ఇంటింటికి చెత్త సేకరణ, తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కలెక్టర్ జే. నివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు ఆదేశాల మేరకు ఇప్పటికే పూడికతీత పనులను వేగవంతం చేశామన్నారు. వర్షాలు పడే లోపుగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. డీ-సిల్టేషన్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కొన్ని ప్రాంతాలలో చెత్తను హూపర్ టిప్పర్ వాహనాలకు ఇవ్వకుండా రోడ్ల పైన డ్రైనేజీలలోను వేస్తున్నారని ఈ విధానాన్ని మానుకోవాలని ఎడిసి నాగ నరసింహారావు సూచించారు. అటువంటి వ్యాపారులు గృహ యజమానులకు గతంలో జరిమానాలు విధించామని భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగితే పెనాల్టీలు వేస్తామన్నారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వెంట శానిటరీ సూపర్వైజర్ రాంబాబు,శానిటరీ ఇన్స్పెక్టర్ రవివర్మ తదితరులు ఉన్నారు.

## ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నామని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ అన్నారు.గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్.. జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి హాజరయ్యారు. సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సిబ్బందికి శిక్షణ, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, కౌంటింగ్ కేంద్రాల్లో కావలసిన ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఈ సందర్భంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఈవోకు వివరించారు. స్ట్రాంగ్ రూములు వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మూడు అంచుల భద్రత, సీసీ టీవీ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామని, జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు కంట్రోల్ రూమ్,మీడియాసెంటర్,ఫెన్సింగ్, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో డా.డి.తిప్పేనాయక్, తుని, ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సీపీవో పీ త్రినాథ్ ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ డీజిల్ రవాణా గుట్టు రట్టు




**రాజమండ్రి, మేజర్ న్యూస్ :** గురువారం యానాం(పుడిచ్చేరి యూటీ) నుంచి అక్రమంగా డీజిల్ రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతోకలిసి సంయుక్తముగా కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు గ్రామ సమీపములో అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనాన్ని నెంబర్ ఎపి 05 టిబి 3645 ను నిలుపుదల చేసి తనిఖీ చేయగా, సదరు ఆయిల్ ట్యాంకర్ నందు 4000 లీటర్ల డీజిల్ ను గుర్తించటమైనది. సదరు డీజిల్‌ను డ్రైవర్ గోవల సుబ్బారావు ఏ సుదీర్ s/శ్రీ వెంకన్నబాబు వారు యానాం (పుడిచ్చేరి యూటీ) లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుండి టాటా ఏస్ వాహనం నెంబర్ ఎపి 37 వై 6456 ద్వారా లీటరుకు రూ.84లకు కొనుగోలు చేసి తదుపరి మోటార్ మరియు పైపు సహాయముతో అశోక్ లేలాండ్ ఆయిల్ ట్యాంకర్ వాహనాన్ని నెంబర్ ఎపి 05 టిబి 3645కు లోడు చేయబడుతుంది తదుపరి అశోక్ లేలాండ్ ట్యాంకర్ కమ్ టాటా ఏస్ వాహనం యజమాని అడ్డాల వీర వెంకట సత్యనారాయణ s/శ్రీ సుబ్బారావు ఆదేశాల మేరకు సదరు డీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ గల చేపలు మరియు రొయ్యల చెరువుల మోటార్‌లకు సప్లయి చేస్తున్నారు.

# ఛండీహోమంలో పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు గురువారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి పౌర్ణమి సందర్భంగా ఛండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఎన్.వి.శేఖర్, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చక్రస్నానం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి చక్రస్నానం గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక వెంకట్రాజు ఆయిల్ సమీపంలో ఉన్న కొబ్బరి తోటలో చక్రస్నానం జరిపారు. అంతకుముందు స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామి, శ్రీ భూసమేత కేశవస్వామివార్లకు త్రిశూల, చక్ర స్నానాలు అత్యంత వైభవంగా జరిగింది. స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా త్రిశూల, చక్ర స్థానాలు నిర్వహిచామని ఆలయ అర్చకులు చంద్రమౌళీ వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవాచార్యులు తెలిపారు. గోర్తి పల్లయ్య పంతులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

# విజయవంతంగా పూర్తయిన ఏపి ఈఏపిసెట్ ప్రవేశపరీక్ష

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్&ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపిసెట్)-2024 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఎనిమిదవ రోజు మే 23వ తేదీ గురువారం రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్‌లో ప్రశాంతంగా జరిగినట్లు ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు. ఏపి ఈఏపిసెట్ ప్రవేశ పరీక్ష గురువారం ఉదయం సెషన్‌తో విజయవంతంగా పూర్తయినట్లు ఉపకులపతి వివరించారు.

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఏపి ఈఏపిసెట్-2024 ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు, యూనివర్శిటీ అధికారులకు, కన్వీనర్‌కు, కో-కన్వీనర్లకు, కో-ఆర్డినేటర్లకు, ఏపి ఆన్‌లైన్ మరియు టిసిఎస్ ప్రతినిధులకు, సిబ్బందికి, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. జెఎన్‌టియుకె కాకినాడకు ఏపి ఈఏపిసెట్-2024 నిర్వహణా బాధ్యతలను అప్పగించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.కె.హేమచంద్రారెడ్డి కి ఉపకులపతి ధన్యవాదాలు తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్న విద్యామండలి ఉన్నత విద్యలో తీసుకువస్తున్న సంస్కరణల కారణంగా ఎక్కువ మంది ఉన్నతవిద్యనభ్యసించడానికి ఆసక్తి చూపడంతో ఏపి ఈఏపిసెట్ ప్రవేశ పరీక్ష వ్రాసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుందని కన్వీనర్



ప్రొ.కె.వెంకటరెడ్డి తెలిపారు. తదనుగుణంగా గత ఏడాది కన్నా ఈ ఏడాది ఏపి ఈఏపిసెట్ ప్రవేశ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఈఏపిసెట్ ప్రవేశ పరీక్షలో హాజరు శాతం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. అగ్రికల్చర్& ఫార్మశీ విభాగానికి సంబంధించి గురువారం ఉదయం ప్రాథమిక 'కీ'ను విడుదల చేయడంతో పాటు రెస్పాన్స్ షీట్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందని, ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల వరకు ప్రాథమిక 'కీ'పై విద్యార్థులకుఏమైనాఅభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రాథమిక 'కీ'ను విడుదల చేస్తామని, దీంతో పాటు రెస్పాన్స్ షీట్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందని, ఈనెల 26వ తేదీ ఉదయం 10గంటల వరకు ప్రాథమిక 'కీ'పై విద్యార్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చునని కన్వీనర్ ప్రొ.కె.వెంకటరెడ్డి పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఎనిమిదవ రోజు గురువారం ఉదయం 30,102 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,182 మంది పరీక్షకు హాజరయ్యారని, 1920మంది గైర్హాజరైనట్లు ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ ప్రొ.కె.వెంకటరెడ్డి తెలిపారు. మొత్తం 93.62శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఎనిమిదవ రోజు గురువారం ఉదయం 930 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 895 మంది పరీక్షకు హాజరయ్యారని, 35మంది గైర్హాజరు కాగా మొత్తం 96.24శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.కె.వెంకటరెడ్డి తెలిపారు.ఏపి ఈఏపిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25% వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రెగ్యులర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపి ఈఏపిసెట్ వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేయవలసి ఉంటుందని, తద్వారా వారికి ర్యాంకులు కేటాయించడం జరుగుతుందని కన్వీనర్ ప్రొ.కె.వెంకటరెడ్డి తెలియజేశారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లలో గాని, ష్ట్రవశ్రీజూఃవంఝజూఖుజూఃఎవీఝజూంఎష్ట్రవ.శీతీస్త్ర మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించాలన్నారు.

## దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే ఆకస్మిక తనిఖీ.



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలో 0-18 సం.ల లోపు ఇంతవరకూ బడిలో పేరు నమోదుకాని ప్రత్యేకావసరాల చిన్నారులగుర్తింపు,తదుపరిబడిలో పేరు నమోదుచేసే "సి.డబ్ల్యు.యెస్.ఎన్ - సర్వే" చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ఐ.ఈ. రిసోర్స్ పర్సన్స్ ఆర్.శ్యాంసుందర్ బాబు, కె. జయలక్ష్మి లు సర్వే చేస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని ఏయస్సార్ జిల్లా సహితవిద్యా సమన్వయకర్త కొమ్మ.భాస్కరరావు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు.దీనిలో భాగంగా మల్లెతోట గ్రామంలో సెరిబ్రల్ పాల్సీ వైకల్యం గల ధర్ముల. హన్విక ను, తన వివరాల నమోదును పరిశీలించారు, సర్వే జరుగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ విషయంలో ఏమైనా సందేహాలుంటే మండల భవిత సెంటర్ ఐఈ రిసోర్స్ పర్సన్స్ ని సంప్రదించాలని సూచించారు.

## ఎన్డీఏ కూటమి 125 స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుంది

- విశాఖలో వై.ఎస్.జగన్, కె.ఏ.పాల్ పరాజయ ప్రమాణ స్వీకారం
- నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఎద్దేవా





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 125 స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని నరసాపురం పార్లమెంట్ సభ్యుడు రఘురామ కృష్ణంరాజు అన్నారు. గురువారం కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) ఆధ్వర్యంలో రఘురామ కృష్ణంరాజుకు వాడపల్లిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆత్రేయపురంలోని ముదునూరి వెంకటరాజు స్వగృహంలో రఘురామకృష్ణంరాజు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు 125 స్థానాల్లో విజయ బావుట ఎగరవేయనున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం రావడం ఖాయమని జోష్యం చెప్పారు. విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారోత్సవానికి జగన్ తరుపున జరుగుతున్న ఏర్పాట్లు గురించి విలేకరులు ప్రస్తావించగా ఎన్నికల్లో ఘోర పరాజయం జీర్ణించుకోలేక విశాఖలో జూన్ 9న కే.ఏ.పాల్, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒకరికొకరు ఎదురెదురుగా పరాజయ ప్రమాణస్వీకారోత్సవం చేసుకుంటారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కరటూరి నరసింహారావు, ముల్లపూడి భాస్కరరావు, చిలువూరి సతీష్ రాజు, కాయల జగన్నాథం, చిటికెన సత్యనారాయణ, గాదిరాజు ప్రసాదరాజు, సాగి చక్రవర్తి, ముదునూరి శ్రీనివాసరాజు, బిజెపి సీనియర్ నాయకులు శిష్ట కుటుంబరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపుకు 14 టేబుళ్ళు ఏర్పాటు

- 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి
- ఆర్వో సీతారామారావు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి కాకినాడ జెఎన్‌టియు నందు స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే నిరంతరం భద్రతను సిసి కెమెరాలతో పర్యవేక్షించడం జరుగుతుందని, పెద్దాపురం ఆర్డీఓ మరియు ఆర్వో జె.సీతారామారావు తెలిపారు. గురువారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపుకు 14 టేబుళ్ళు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 4 టేబుళ్ళు, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక టేబుల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్‌కు 14 మంది, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 4 టేబుల్స్‌కు నలుగురు, ఆర్వో టేబుల్ వద్ద ఒకరు చొప్పున 20మంది వరకు కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవలసినదిగా తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లకు నేర చరిత్ర, పోలిస్ కేసులు లేకుండా ఉన్నవారిని, సత్ప్రవర్తన కలిగిన వారిని ఏర్పాటు చేసుకోవలసినదిగా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ఏజెంట్లను కౌంటింగ్ హాలులోకి రానిచ్చే కౌంటింగ్ ఏజెంటు గుర్తింపు కార్డు ఫారం-18 తప్పనిసరిగా తెచ్చుకుంటేనే కౌంటింగ్ హాలులోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ ఎటువంటి రెచ్చగొట్టే ప్రకటనలు గాని, ప్రసంగాలు గాని చేయకుండా,శాంతిభద్రలకు విఘాతం కలగకుండా, ఎటువంటిఅవాంఛనీయసంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఓట్ల లెక్కింపుకు సహకరించాలని ఆర్వో కోరారు. అలాగే అందరి సహకారంతోనియోజకవర్గంలోఎటువంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించారని, అలాంగే ఓట్ల లెక్కింపుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు ఎస్.శ్రీనివాసరెడ్డి, వై.శ్రీనివాస్, కె.వి.పద్మావతి, జె.రామారావు, పలు పార్టీల రాజకీయ ప్రతినిధులుపాల్గొన్నారు.

# ప్రపంచ జనావళికి మార్గదాత బుద్ధుడు

- అంబేడ్కర్ బుద్ధ విహారలో ఘనంగా బుద్ధుని జయంతోత్సవం






కాకినాడ,మేజర్‌న్యూస్:ప్రపంచజనావళికిమార్గదాత బుద్ధుడని, ఆయన బోధనలు ప్రపంచానికి అనుసరణీయమని, ఆయన చూపిన పంచశీల, ఆర్య అష్టాంగ మార్గం, దశపారమితలు నేటి ప్రజల సుఖసంతోషాలకు అత్యంత ఆవశ్యమని బౌద్ధ రచయిత, బుద్ధ విహార పూర్వ అధ్యక్షులు ఉపాసక వి.వి.సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక అచ్యుతాపురం కాకినాడలో గల అంబేడ్కర్ బుద్ధ విహారలో వైశాఖ పౌర్ణమి, భగవాన్ బుద్ధుని జయంతోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగవానుని జీవితానికి వైశాఖ పౌర్ణమికి ఎంతో ప్రాముఖ్యమైన సంబంధం ఉందని, విశ్వ గురువైన బుద్ధ భగవానుని జననం... జ్ఞానోదయం... మహాపరినిర్వాణం వైశాఖ పౌర్ణమి రోజున జరగడం ప్రపంచంలో అత్యంత అద్భుతమని వాటి ప్రాముఖ్యత ను అద్భుతంగా వివరించారు. ముందుగా విహార ప్రాంగణంలో పంచశీల పతాకాన్ని విహార ఉపాధ్యక్షులు డి.వెంకటరావు ఆవిష్కరించారు. అనంతరం విహార నుండి కాకినాడ పుర వీధుల్లో రామారావుపేట మీదుగా ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి జిల్లా పరిషత్ కుళాయిచేరువు, టూ టౌన్, భానుగుడి, జీపీటి, కరణంగారి జంక్షన్ మీదుగా విహారకు చేరుకుని బుద్ధ వందన పంచశీల ఆచరణ అంబేద్కర్ రచన బుద్ధుడు అతని ధమ్మం పఠనం తరువాత ప్రవచనం చేసారు. బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని విహార కుటుంబ సభ్యులు బడుగు అభిషేక్ దంపతుల కుమారుడు సాత్విక్ అలెక్స్‌కు సత్యనారాయణమూర్తి చే అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. విహార కుటుంబ సభ్యులు డా.శివప్రసాద్ మైత్రీ అల్పాహారం ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో డా.జవహర్,డా.రామారావు పి.రాంప్రసాద్ ఎన్.సరోజిని, పి.పావన్ ప్రసాద్, పి.వి.సత్యనారాయణ, పి.ఎస్.ఆర్.ప్రసాద్, ఎం.సుబ్బారావు, కే.నరసింహారావు, పీ.సుధీర్, ఎం.జగన్నాథరావు, డి.రామకృష్ణ, నాగమునేంద్రరావు, పెద్దిరాజు, శ్రీహరి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ధమ్మ పాళ గాధతో కార్యక్రమం ముగిసింది.

# ఆర్టీసీ బస్సుకు ప్రమాదం...

- లారీల పార్కింగ్ ప్రమాదాలకు కారణం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణం ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పెద్దిపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ప్రమాదం సంభవించింది. సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పెద్దాపురం రోడ్డు మీదుగా వచ్చి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కుడి వైపునకు తిరుగుతున్న బస్సుకు పెద్దాపురం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్యలో అడ్డుగా రావడంతో రెండు వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. అయితే ప్రయానీకులకు గానీ, బస్సు, ట్రాక్టర్ డ్రైవర్ లకు గానీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

**-లారీల పార్కింగ్ వలెనే ప్రమాదం ..**ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గల విటికర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని పలువురు లారీ యజమానులు వారి లారీలను రోడ్డు మీదివరకు పార్కింగ్ చేసి రోడ్డును ఆక్రమిస్తుండటంతో ఇక్కడ ప్రమాధాలు తరచూ జరుగుతున్నట్టు పలువురు చెబుతున్నారు. లారీలు పార్కింగ్ రోడ్డుపై వరకూ ఉండటంతో పెద్దాపురం వైపునుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్యలో వరకూ వెళ్లడం, అదే సమయానికి పెద్దిపాలెం వెళ్లే ఆర్టీసీ బస్సు మలుపు తిరగడంతో డ్రైవర్ లకు రోడ్డు క్లియరెన్స్ తెలియక ఈ ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ లు చెబుతున్నారు. కాగా ప్రమాదం సమాచారంతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాధానికి గురైన వాహనాలను తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. అలాగే రోడ్డు పై వరకూ పార్కింగ్ చేసిన లారీ యజమానులను పోలీసులు హెచ్చరించి ఇబ్బంది కారంగా ఉన్న లారీ లను అక్కడ నుంచి తొలగించే చర్యలు చేపట్టారు.

## దివ్యాంగుల గుర్తింపు సర్వే వేగవంతం

- సర్వేలో పాల్గొన్న ఐఇఆర్‌పిలు



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** సమగ్ర శిక్షారాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలో భవిత సెంటర్‌లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి మరియు ప్రభుత్వపాఠశాలలో సిడబ్ల్యుఎస్ఎన్ పిల్లలను జాయిన్ చేయడానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మే 1 నుండి జూన్ 9వ తేది వరకు ఐఇఆర్‌పిలు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావుల ఆధ్వర్యంలో ఐఇఆర్‌పిలు డోర్ టు డోర్ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఐఇఆర్‌పి దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలుపుతూ ఈ సర్వేలో అంగన్‌వాడీల కేంద్రాలు, గ్రామ సచివాలయాల నుండి 21 రకాల వికలత్వం కలిగిన పిల్లలను గుర్తించి వారిని జూన్ నెలలో కల్ల స్కూల్‌లో జాయిన్ చేసే విధంగా సర్వే చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గురువారం కొండపల్లి, కట్టమూరు, ఎన్‌టిఆర్ కాలనీ, మంగళవారపుపేట, సిబిదేవం, పెద్దాపురం అర్బన్, కొండయ్యపేట, మిరపకాయల వీధి, జె.తిమ్మాపురం, గుడివాడ గ్రామలలో ఈసర్వే చేయడం జరిగిందని, వీటిలో 13 మందిని మానసిక వైకల్యం కలిగిన వారిని, ఇద్దరు చలన వైకల్యం, ముగ్గురు వినికిడి సమస్య కలిగిన పిల్లలను, ఇద్దరు మెదడు పక్షవాతం, నలుగురు బహుళ వైకల్యం కలిగినవారిని గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు.

అలాగే దీనికి సంబంధించి, ఈ సర్వే రిపోర్టును ఏ రోజుకారోజు మండల విద్యాశాఖ కార్యాలయం ద్వారా జిల్లా కార్యాలయంకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# అమెరికాలో పర్యటించనున్న ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె కాకినాడ విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ+ గ్రేడ్ వచ్చిన నేపథ్యంలో విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను యూనివర్శిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు గాను ఒక వారం రోజుల పాటు పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మరియు యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్‌లతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం అమెరికాలో పర్యటించనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్‌టియుకె పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు శాన్‌ఫ్రాన్సిస్కో, డల్లాస్, వాషింగ్టన్ డిసిలలో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమావేశాలలో పాల్గొననున్నట్లు వివరించారు. అమెరికాలోని మిస్సోరీ యూనివర్శిటీ, చికాగో స్టేట్ యూనివర్శిటీ, టెక్సాస్‌లోని ఏ&ఎం యూనివర్శిటీలతో సహకార కార్యక్రమాలు, స్టూడెంట్-ఫ్యాకల్టీ ఎక్చేంజ్ ప్రోగ్రామ్, అంతర్జాతీయ గ్రాంట్ల మంజూరు కొరకు దరఖాస్తు చేయడం మరియు వివిధ యూనివర్శిటీల అధికారులతో సమావేశమై విద్య మరియు పరిశోధనలలో సహకారం కోసం చర్చలు జరుపుతామన్నారు.యుఎస్ విశ్వవిద్యాలయాల సహకారంతో తదుపరి జాయింట్ గ్రాంట్స్ కోసం దరఖాస్తు చేసేందుకు మిస్సోరీ యూనివర్శిటీతో చర్చలు జరపనున్నామని, గతంలో ఇదే యూనివర్శిటీతో పార్టనర్‌షిప్-2020 గ్రాంట్‌ను 2020-2022 మధ్య విజయవంతంగా అమలు చేసి అమెరికా ప్రభుత్వం నుండి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందడం జరిగిందన్నారు. జెఎన్‌టియుకె కాకినాడ 2015-2019వరకు చికాగో స్టేట్ యూనివర్శిటీతో కలిసి ఒబామా-సింగ్ ఇనిషియేటివ్స్ గ్రాంట్స్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. అదేవిధంగా కంటెంట్, అసైన్‌మెంట్‌లు మరియు ఇంటర్న్‌షిప్స్ కోసం ఇన్ఫోసిస్, విప్రో సంస్థలతో జాయింట్ ఎంఎస్ ప్రోగ్రామ్‌లను ప్రారంభిస్తున్నామన్నారు.ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు సారథ్యంలో అమెరికాలో పర్యటించనున్న ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటన విజయవంతం కావాలని యూనివర్శిటీ డైరెక్టర్‌లు, అధికారులు తదితరులు ఆకాంక్షించారు.

## 13వ రోజుకు చేరిన చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురంపట్టణంలో స్థానిక వరహాలయ్యపేటలో యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ గురువారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో బొమ్మలు తయారుచేసే ప్రాపర్టిషో, స్పాంజ్‌తో బొమ్మల తయారీకి శిక్షణ, అలాగే పిల్లలకు కథలు రూపంలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. 1వ తరగతి నుండి 3వ తరగతి విద్యార్థులకు కాగితపు బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు శిక్షకులు, చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంఠ, నేహ, రేణుక, శ్రీజ రవి,పవన్, తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ క్రాఫ్ట్,డాన్స్‌లలో శిక్షణ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కుళాయి చెరువు పార్క్‌లో గల గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా 8వ రోజు అయిన గురువారం నాడు పాఠశాల విద్యార్థులకు కథలు చెప్పడం, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో రీసోర్స్ పర్సన్ పి.వీరబాబు పేపర్ క్రాఫ్టు, డ్రాయింగ్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, చిన్నారులతో డ్యాన్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారంగ్రంథాలయాధికారి పాలంకి నాగరాజుమాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకో వాలని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వాట్సప్ ద్వారా పంపించిన నీతి కథలు వినిపించడం జరిగింది. టి.సుబ్బారావు యోగాభ్యాసం, తెలుగులో నీతి పద్యాలు చెప్పారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు కాటమరాజు, వై.రాజేష్, బి.అరవిందకుమార్, కె.దుర్గాప్రసాద్, సిబ్బంది సింగం బుల్లియ్య, పాల్గొన్నారు.

## కుళాయిలు ద్వారా ఆకుపసరు నీరు సరఫరాపై కమీషనర్ పరిశీలన



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** కుళాయిల్లో ఆకుపసరు త్రాగునీరు సరఫరా అవుతున్నట్టు ప్రజలు భయపడుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని మున్సిపల్ కమీషనర్ జాస్తి రామారావు సూచించారు. గత కొద్ది కాలంగా కొళాయిల్లో పసరు రంగులో త్రాగునీరు వస్తున్నట్టు ప్రజలు చెబుతున్న కారణంగా గురువారం స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ చెరువును, ఫిల్టర్ బెడ్ పనితీరును కమీషనర్, మున్సిపల్ ఎఇ, ఇతర అధికారులు పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ చెరువులో పసరు రంగులో ఉన్న జాలాలను వారు పరిశీలించారు. అలాగే ఆ జలాలను శుద్ధిచేసే పద్ధతిని అధికారులు పరిశీలించి జాలాలలో కలుపుతున్న ఆలమ్, క్లోరిన్ శాతాలపై సిబ్బందిని ప్రశ్నించి వారికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమీషనర్ రామారావు మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో జలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో నాచుపట్టి పసరు రంగులోకి మారినట్టు చెప్పారు. తాజాగా స్థానిక పరిస్థితి పై పబ్లిక్ హెల్త్ డిఇ, ఎఇ లు సైతం పరిశీలించడం జరిగిందన్నారు. అయితే ఫిల్టర్ బెడ్ వద్ద అవసరానికి మించి ఆలమ్, క్లోరిన్ లు ఉన్నప్పటికీ పరిమితిని మించి అధికంగా వాటిని వినియోగిస్తే ఆ నీరు త్రాగే ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాద్ధముందన్నారు. నీటిని ఎంత శుద్ధిచేసినా పసరు కొంచెం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు కొళాయిల్లో వచ్చే నీటిని కొద్ది రోజులపాటు కాచి, చల్లార్చి త్రాగాలని ఆయన సూచించారు. కాగా ఫిల్టర్ బెడ్ చెరువులో ఎలాంటి చేపల వేట జరగడం లేదన్నారు. రాత్రి సమయాల్లో కూడా ఏ విధంగానూ చేపల వేట జరగకుండా ఎఇ పర్యవేక్షణ లో 24 గంటల పాటు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొద్ది రోజులు పాటు ప్రజలు అవురామాత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని ఈ సందర్భంగా కమీషనర్ రామారావు పట్టణ ప్రజలకు తెలిపారు.